క్లుప్తంగా

2న మెగా రక్తదాన శిబిరం

ఏర్పేడు: యువ సమాజ్ నిర్మాణ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 2న ఏర్పేడులో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు తెలిపారు. రక్తదానం చేసే వ్యక్తులు 9502602439, 9703156866 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ముక్కంటి సేవలో తెలంగాణ ఎమ్మెల్సీ



ఎమ్మెల్సీ వాణీదేవికి ముక్కంటి జ్ఞాపిక అందజేస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కుమార్తె, తెలంగాణ ఎమ్మెల్సీ ఎస్.వాణీదేవి దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేద పండితులు పాల్గొన్నారు.

నేడు మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

పిచ్చాటూరు: కొత్తగా నియామకమైన నాగలాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, సభ్యుల ప్రమాణ స్వీకారం సోమవారం జరగనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాగలాపురం మండల కన్వీనర్ అపరంజిరాజు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సమక్షంలో ఈ కార్యక్రమం జరగనున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కారు బోల్తా.. ముగ్గురికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

చంద్రగిరి/భాకరాపేట: తిరుపతి–మదనపల్లె జాతీయ రహదారి భాకరాపేట కనుమలో ఆదివారం సాయంత్రం కారు అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ముగ్గురు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. సత్యసాయి జిల్లా హిందూపురానికి చెందిన హరినాథ్, రేఖారాణి, కిరణ్ కుమార్ తిరుమల శ్రీవారి దర్శనం కోసం ఆదివారం కారులో బయలుదేరారు. భాకరాపేట కనుమలోని పెద్ద మలుపు దాటే క్రమంలో వర్షం కారణంగా కారు అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో కారులోని ఎయిర్ బె లూన్లు తెరుచుకోవడంతో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పో లీసులు, 108 సిబ్బంది వారిని తిరుపతి రుయాకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల కోసం రామాయణం ప్రదర్శన



టీవీలో రామాయణం చూస్తున్న విద్యార్థులు

బుచ్చినాయుడుకండ్రిగ: ఏప్రిల్ 3వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి సన్నద్ధతలో భాగంగా ప్రత్యేక తరగతుల నిర్వహణలో రామాయణాన్ని విద్యార్థులకు ప్రదర్శించారు. ఈ సందర్భంగా హెచ్ఎంలు రమణయ్య మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షలలో సంఘటనా క్రమం, పాత్ర స్వభావం, వ్యాసరూప ప్రశ్నలతో పాటు 20 మార్కులు రామాయణం నుంచి అడుగుతారని, ఇప్పటికే రామాయణం ప్రదర్శించడం జరిగిందన్నారు. ఒకసారి విద్యార్థులకు చిత్రాన్ని ప్రత్యక్షంగా కథనాత్మక రూపంలో చూస్తే విద్యార్థులకు ఉపయుక్తంగా గుర్తుంటుందని తెలిపారు. అందులో భాగంగా తెలుగు ఉపాధ్యాయులు యువశ్రీమురళి రామాయణం చిత్రాన్ని పాఠశాలలో టీవీలో చూపిస్తూ చిత్రంలో పాత్రలను వివరించారు.

నిస్వార్థంగా పనిచేసేవారికి సముచిత స్థానం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే



ర్యాలీగా వస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

రేణిగుంట: వైఎస్సార్‌సీపీ అభివృద్ధి కోసం నిస్వార్థంగా పని చేసిన వారికి సముచిత స్థానం, గుర్తింపు లభిస్తుందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి స్పష్టం చేశారు. రేణిగుంటకు చెందిన ముస్లిం నాయకుడు మహమ్మద్ రసూల్ వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షునిగా నియమితులైన సందర్భంగా ఆదివారం రేణిగుంట వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రాంగణం వద్ద సన్మాన సభ జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత డాక్టర్ జనార్దన్ ఆస్పత్రి కూడలి నుంచి భారీ ర్యాలీగా పార్టీ శ్రేణులు ఎమ్మెల్యేతో కలసి పార్టీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రేణిగుంటకు చెందిన రసూల్‌ను మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా పదవి ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. పార్టీ కోసం కష్టపడే వారు ఆశించకున్నా వారికి పిలిచిమరీ పదవులిస్తామన్నారు. మరో 15ఏళ్లు జగనన్నే ముఖ్యమంత్రిగా ఉంటారని, తాను ఎమ్మెల్యేగా ప్రజలందరి దీవెనలతో మళ్లీ ఎన్నికై మిగిలిన వారికి కూడా తగిన గుర్తింపు ఇస్తానని పేర్కొన్నారు. నియోజకవర్గంలో పేద ముస్లిం ఇళ్లలో వివాహాలు జరిగితే వారికి బీరువా, మంచం, టీవీ అందిస్తున్నానన్నారు. ఎక్కడైనా పేదలు చనిపోతే రూ.10వేలు వ్యక్తిగతంగా సాయం అందిస్తున్నట్లు తెలిపారు. కరోనా కాలంలో ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకే చాలా మంది భయపడితే తాను నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజలందరికీ నిత్యావసర సరుకులు, చికెన్ పంపిణీ చేశానని గుర్తు చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ నాయకులు మళ్లీ మోసపూరిత మాటలతో మెల్లగా వస్తున్నారని, వారి మాయమాటలు నమ్మవద్దని సూచించారు. రేణిగుంటలో రూ.15కోట్లతో తెలుగుగంగ రెండో పైప్‌లైన్ ద్వారా తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ.. పార్టీ కార్యకర్తలంతా శక్తివంచన లేకుండా కృషి చేసి మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా, బియ్యపు మధుసూదన్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని కోరారు. అనంతరం మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన రసూల్‌ను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి, ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు సంధ్య, వైస్ ఎంపీపీ సుజాత, సింగిల్‌విండో అధ్యక్షుడు గణేషరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, రేణిగుంట సర్పంచ్ నగేషం, నాయకులు జువ్వల దయాకర్ రెడ్డి, గంగారి రమేష్, ఉప సర్పంచ్ ఇర్ఫాన్, కోఆప్షన్ సభ్యుడు సుభాన్‌రాజ, ఇరానీ ఖాదర్, యోగేశ్వరరెడ్డి, ముద్దురాయులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



రైతు భరోసా కేంద్రం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

- రైతుల పక్షపాతి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- సచివాలయాల ఏర్పాటుతో గ్రామాల్లో సమస్యలు పరిష్కారం
- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రజాసంక్షేమంతో పాటు అభివృద్ధే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని, ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. ఆయన ఆదివారం మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఆరణి విద్యానాథరెడ్డి ఆధ్వర్యంలో నీర్పాకోట గ్రామంలో రూ.22 లక్షలతో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల పక్షపాతిగా మారి, రైతుల అభ్యున్నతి కోసం గ్రామ సచివాలయాల పరిధిలో రైతు భరోసా కేంద్రాలను నిర్మించి, రైతులకు రసాయనిక ఎరువులు, రైతులు పండించిన పంటలను కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. పంటలను వేసుకోవడానికి పెట్టుబడి కింద రైతు భరోసా పథకంలో నగదును రైతులకు అందిస్తున్నారన్నారు. గ్రామ సచివాలయాల్లో పనిచేసే అధికారులు, గ్రామ వలంటీర్లు సమష్టిగా పనిచేస్తేనే నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడపగలమని తెలిపారు. గ్రామ స్థాయిలో ప్రభుత్వ పాలనను తీసుకురావాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి, సచివాలయాల పరిధిలో రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ క్లినిక్‌లను ఏర్పాటు చేశారన్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో గ్రామాల్లో చాలా వరకు సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. నవరత్నాలతో పేదవాడి అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అర్హులైన ప్రజలందరికీ నవరత్నాలను అందిస్తున్నారని, వీటిని ప్రజలకు చెంతకు గ్రామ వలంటీర్లు చేర్చాలని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆరణి విద్యానాథరెడ్డి, ఎంపీపీ మేకల సుబ్బలక్ష్మి, ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు, ఏఓ భారతి, నాయకులు ఇమామ్‌బాషా, మార్కండేయులు, సుందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు



పూజలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

సత్యవేడు: పదో తరగతి విద్యార్థులు ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఎంఈఓ కే.రవి అన్నారు. ఆదివారం సాయంత్రం బాలుర గురుకుల ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విజయానికి బాటలు వేసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్లు తీసుకురావద్దని హెచ్చరించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఉంటుందని తెలిపారు. అంతకుముందు పాఠశాలలో నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రిన్సిపల్ శ్రీనివాసులు, స్కూల్ కమిటీ చైర్మన్ రవికుమార్ దేవర్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు.

జీయ్యంగార్లు, భక్తులకు విసన కర్రల పంపిణీ



జీయ్యంగార్లకు విసన కర్రలు అందజేస్తున్న చిత్రపు హనుమంతరావు

తిరుపతి కల్చరల్: కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సూర్య ప్రభ వాహన సేవలో పాల్గొన్న భక్తులు, జీయ్యంగార్లకు చిగోరా ఆధ్యాత్మిక సేవా కేంద్రం నిర్వాహకులు విసన కర్రలు పంపిణీ చేశారు. చిగోరా ఆధ్యాత్మిక సేవా కేంద్ర నిర్వాహకుడు చిత్రపు హనుమంతరావు మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా స్వామివారి బ్రహ్మోత్సవాల్లో సూర్యప్రభ వాహన సేవలో ప్రతి ఏటా జీయ్యంగార్లు, భక్తులకు సుమారు 500 విసన కర్రలు అందజేస్తున్నామని తెలిపారు. కలకండ ప్రసాదం అందజేశారు. బీజేపీ నేత భక్తవత్సలం గీతామృతం పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకట గాయత్రి సేవా ట్రస్ట్ నిర్వాహకుడు సీఆర్‌కే.శేషగిరిరావు, లీలావతి, రవికుమార్ పాల్గొన్నారు.

రోడ్డు సమస్య పరిష్కరించాలని నిరసన



మాట్లాడుతున్న సర్పంచ్ పెంచలయ్య

ఏర్పేడు: రోడ్డు సమస్యను పరిష్కరించేంత వరకు పోరాటం చేస్తామని సర్పంచ్ పెంచలయ్య అన్నారు. ఆదివారం మండలంలోని చిందేపల్లి సమీపంలో ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్స్ లిమిటెడ్ కర్మాగారం యాజమాన్యం రోడ్డుకు అడ్డంగా నిర్మించిన గోడ వద్ద ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. 80 ఏళ్లుగా గ్రామస్తులు చిందేపల్లి నుంచి కర్మాగారం మధ్యలో ఉన్న రోడ్డు ద్వారా వెళుతుండేవారన్నారు. ఈ నెల 18న యాజమాన్యం రోడ్డుకు అడ్డంగా గోడను నిర్మించినట్లు తెలిపారు. రోడ్డు సౌకర్యం లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. తమ గోడును వెళ్లబోసుకోవడానికి ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లకుండా పోలీసులు గ్రామ నిర్బంధం చేయడం దారుణమన్నారు. సీపీఎం జిల్లా నాయకుడు అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ.. గోడను తొలగించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు.

అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపు



మాట్లాడుతున్న ఆరణి విద్యానాథరెడ్డి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో అభివృద్ధి పనులు చేపట్టడానికి రూ.35 లక్షల నిధులను కేటాయించినట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు ఆరణి విద్యానాథరెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 2020–21 ఆర్థిక సంఘం మండల నిధుల నుంచి రూ.35 లక్షలు కేటాయించారని, గ్రామాల్లో తాగునీటి కోసం రూ.10 లక్షలతో 18 బోర్లు, ఎంపీడీఓ కార్యాలయం చుట్టూ రూ.18.50 లక్షలతో కాంపౌండ్ వాల్ నిర్మాణం, తెత్రిపాడు గ్రామంలో రూ.4.50 లక్షలు, కాటూరు గ్రామంలో రూ.3 లక్షలు, కారణిమిట్ట గ్రామంలో అభివృద్ధి పనుల కోసం రూ.4 లక్షలను కేటాయించడం జరిగిందన్నారు. ఇందులో ఎలాంటి అవకతవకలు జరగలేదని తెలిపారు. కార్యక్రమంలో సురుటుపల్లి దేవస్థానం సభ్యులు అజయ్‌కుమార్ రెడ్డి, నాయకులు తులసీ, భాస్కర్‌రెడ్డి, వెంకటయ్య, సుబ్రమణ్యం, ధర్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉరకలెత్తిన ఉత్సాహం



దూసుకుపోతున్న కోడె గిత్తలు



కోడెగిత్తలను నిలువరిస్తున్న యువకులు

వెదురుకుప్పం : సై అంటే సై అన్నట్లు ఆదివారం మండలంలోని పాతగుంటలో సాగిన జల్లికట్టు యువకుల్లో జోష్ తెచ్చింది. రంకెలేస్తూ దూసుకుపోయిన కోడెగిత్తలు...ఈలలు కేకలతో పలకల కోసం యువత చేసిన సాహసాలు...పోట్లగిత్తల పరుషానికి బెంబేలెత్తిన జనం చప్పట్లతో ఎద్దల పందేలు దుమ్మురేపాయి. నిర్వాహకులు ఎద్లకు పలకలు, వస్త్రాలు కట్టి పందేనికి సిద్ధం చేశారు. అప్పటికే అధిక సంఖ్యలో గ్రామానికి చేరుకున్న యువత పందేనికి సై అన్నట్టు అల్లి వద్ద నిలబడ్డారు. పందేనికి సిద్ధంగా ఉన్న ఎద్లను ఉసిగొల్పారు. కోడెగిత్తలు రంకెలేసుకుంటూ జన ప్రవాహాన్ని చీల్చుకుంటూ దూసుకుపోయాయి. పలుసార్లు ఎద్లు దారి తప్పి దూసుకుపోవడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఎద్దులను నిలువరించి పలకలు పట్టేందుకు యువత విశ్వ ప్రయత్నం చేశారు. కట్టడి చేసే క్రమంలో యువతను చిందరవందర చేస్తూ ముందుకు సాగాయి. యువకులు ఎంత ప్రయత్నించినా పశువుల దూకుడును కట్టడి చేయలేక నిరుత్సాహపడ్డారు. పలకలు లాక్కొనే సందర్భంలో ఒకరికొకరు తోసుకున్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



నాగలాపురం: టోర్నీ విజేతకు బహుమతి ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు: క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు దేహదారుఢ్యాన్ని పొందవచ్చని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. ఆదివారం నాగలాపురంలో ఎన్‌వైసీసీ క్రికెట్ టోర్నమెంట్ విజేత నాగలాపురం జట్టుకు రూ.30 వేలు నగదు, కప్పును ఎమ్మెల్యే ఆదిమూలం చేతుల మీదుగా బహూకరించారు. రన్నర్‌గా నిలిచిన తమిళనాడు తిరువళ్లూరు సమీపంలోని మెయ్యూరు వేల్‌మురుగన్ జట్టుకు ద్వితీయ బహుమతిగా రూ.20 వేలు నగదు, కప్పును అందించారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌ను అందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అపరంజిరాజు, రైతు సలహా మండలి చైర్మన్ చిన్నదొరై, జిల్లా సంయుక్త కార్యదర్శి మునిరత్నం, పల్లికొండేశ్వరాలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, సభ్యులు సురేష్, నాయకులు శ్యామ్, ఉదయ్‌కుమార్ రెడ్డి, అలగేశన్, దేశప్పన్, కులశేఖర్ రెడ్డి, మహేష్, విజయ్‌కుమార్, దేశన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ప్రతిష్టను దెబ్బతీయడం సరికాదు

- సీసీ కెమెరాల నిఘాలోనే విగ్రహ తొలగింపు
- ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు తగవు
- అవసరమైతే సీసీ ఫుటేజీలు ఇస్తాం
- మీ వద్ద ఆధారాలు ఉంటే బయట పెట్టండి
- ప్రమాణ స్వీకారానికి మేం సిద్ధం.. మీరు సిద్ధమా
- టీడీపీ నేత సుధీర్‌కు ఆలయ చైర్మన్ అంజూరు సవాల్



సమావేశంలో మాట్లాడుతున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ ఆలయాల పవిత్రతను దెబ్బతీసే విధంగా అసత్య ఆరోపణలు చేయడం టీడీపీ నేత బొజ్జల సుధీర్‌రెడ్డికి సరికాదని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు హితవుపలికారు. ఆదివారం శ్రీకాళహస్తీశ్వరాలయం పరిపాలన భవనంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు తగవన్నారు. స్వామివారి ఆలయం లేదా కాణిపాకంలో ప్రమాణం చేసేందుకు టీడీపీ నాయకులు రావాలని కోరారు. భగవంతుని సేవలో ధర్మబద్ధంగా ధర్మకర్తల మండలి నడుచుకుంటుందని.. ప్రతి పైసాకు జవాబుదారీతనంగా వ్యవహరిస్తామని తెలిపారు. శ్రీకాళహస్తి పరువు తీసేలా ప్రవర్తించవద్దని సుధీర్‌రెడ్డికి హితవు పలికారు. శ్రీప్రసన్న వరదరాజస్వామి విగ్రహం కింద బంగారు నాణేలు లభించాయని? వాటిలో కొన్ని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తీసుకెళ్లి హైదరాబాద్‌లో అమ్ముకోవడానికి ప్రయత్నిస్తున్నారంటూ అసత్య ఆరోపణలు చేయడం నీచమైన చర్య అని మండిపడ్డారు. వరదరాజులస్వామి ఆలయ పునర్నిర్మాణం రాష్ట్ర స్థపతి సూచనల మేరకు చేపట్టినట్లు తెలిపారు. మూలవిరాట్ తొలగింపుపై 13వ తేదీనే ప్రకటన చేశామని.. అన్ని పార్టీలు, మఠాధిపతులకు, ధార్మిక సంస్థలకు సమాచారం ఇచ్చామని తెలిపారు. 17న భక్తులు, పుర ప్రముఖులు, పట్టణ ప్రజలు, ధర్మకర్తల మండలి, అధికార యంత్రాంగం సమక్షంలో తొలగింపు చేసి పంచనామా చేసినట్లు వివరించారు. సీసీ కెమెరాలతో పర్యవేక్షణలో ఇవన్నీ జరిగాయన్నారు. అయినా సుధీర్‌రెడ్డి ఇక్కడ ఉన్నట్లు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఆయనకు పంచనామా సీసీ ఫుటేజీలు అందజేస్తామన్నారు. సుధీర్‌రెడ్డి తన వద్ద ఉన్న ఆధారాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని దక్షిణామూర్తి లేదా కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి వద్ద ప్రమాణం చేయడానికి ముందుకు రావాలని సవాల్ విసిరారు. పస్తులైనా ఉంటామే కానీ దేవుని సొత్తు తినే రకం కాదన్నారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి నాణేలు అమ్ముకుని బతికే స్థితిలో లేరని.. పది మందికి దానధర్మాలు చేసే స్థితిలో ఉన్నారన్నారు. అసత్య ఆరోపణలు చేస్తే శ్రీకాళహస్తి ప్రజలు హర్షించరన్నారు. సుధీర్‌రెడ్డి ఒకసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. ధర్మకర్తల మండలి సభ్యులు పసల సుమతి, బుల్లెట్ జయశ్యామ్, కొండూరు సునీత, రమాప్రభ, లక్ష్మి, ప్రత్యేక ఆహ్వానితులు చింతామణి పాండు ఉన్నారు.

శిల్పారామంలో ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



భరతనాట్యం చేస్తున్న కళాకారులు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కేరళకు చెందిన కేరళ నాట్య కళాలయం ఆధ్వర్యంలో నాట్య గురువు సుజాత రాధాకృష్ణన్ నేతృత్వంలో భరత నాట్యంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఏకదంతాయ, శివ తాండవం, వేయి నామాల, ఢమరుకం, అయిగిరి నందిని, పౌర్ణమి, శివనామం, ప్రణవాలయ తదితర పాటలకు కళాకారులు మోహిత్ శ్రీ, జయశ్రీ, జాస్మిన్, నేశ్విక, హాసిని, సూర్య, హర్షిత, శివప్రియ, తనుశ్రీ అద్భుతంగా అభినయం చేశారు. వారిని ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.

విహంగ.. వీక్షణం





కేంద్రంలో విడిది చేస్తున్న గూడబాతులు, పక్షుల కేంద్రంలోని చెరువు కట్టపై వ్యూ పాయింట్ వద్ద విహంగాల వీక్షిస్తున్న విద్యార్థులు

దొరవారిసత్రం: వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసి విద్యార్థుల సందడి ఓవైపు... మరోవైపు పక్షుల కేరింతలతో ఆదివారం నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం కోలాహలంగా మారింది. ఎండ తీవ్రంగా ఉన్నప్పటికీ పక్షి ప్రేమికులు వేడిని సైతం లెక్క చేయకుండా పక్షులను వీక్షించారు. వలస విహంగాలను వీక్షించేందుకు మదనపల్లె, తిరుపతి, నెల్లూరు, శ్రీకాళహస్తి, చిత్తూరు తదితర ప్రాంతాల్లో ఉన్న ప్రైవేటు పాఠశాల విద్యార్థులు వెయ్యి మందికి పైగా బస్సుల్లో ఇక్కడకు వచ్చి పక్షులను వీక్షించారని స్థానిక వన్యప్రాణి విభాగం సిబ్బంది తెలిపారు. స్థానికంగా ప్రసిద్ధి చెందిన గూడబాతులు, తెల్ల కంకణాయిలు, తెడ్డు ముక్కు కొంగలు, నత్తగుల్ల కొంగల పిల్లలు అన్నీ పెద్దవై ఎగిరే స్థాయిలో చేరాయి. వీటి సీజన్ త్వరలోనే ముగియనుంది. సందర్శకులకు అవసరమైన తాగునీటి వసతి మార్గం మధ్యలో ఏర్పాటు చేసేలా పక్షుల కేంద్రం రేంజర్ ఆఫీసర్ వరప్రసాద్ చర్యలు చేపట్టారు. బయట ప్రాంతాల నుంచి కేంద్రానికి విచ్చేసే పర్యాటకులకు విహంగాల జీవన శైలి, ప్రకృతిలో పక్షుల ప్రాధాన్యత వంటి అంశాల గురించి స్థానిక సిబ్బంది వివరించారు. చెరువు కట్టపై ఉన్న వ్యూ పాయింట్ల వద్ద పక్షులను దగ్గర చూసేందుకు బైనోక్యులర్స్ వంటివి కూడా సిబ్బంది అందుబాటులో ఉంచారు. విదేశీ వలస విహంగాలతో పాటు పర్యావరణ కేంద్రంలో విహంగాల చిత్రాల ప్రదర్శన, పార్కులోని జింకలు, చిలుకలు అందరిని ఆకట్టుకున్నాయి.